క్లుప్తంగా

నకిలీ నోట్ల కలకలం



పర్వతగిరి : మండల కేంద్రంలో నకిలీ నోట్ల చలామణి కలకలం సృష్టిస్తోంది. స్థానిక దుర్గాశ్రీ వైన్స్ యజమాని కథనం ప్రకారం.. వైన్స్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం మద్యం కొనుగోలు చేశారని, మొదటి వ్యక్తి రూ.500, రెండో వ్యక్తి రూ.100 రెండు నోట్లు ఇచ్చి మద్యం తీసుకున్నట్లు వివరించారు. కాగా షాపు యజమాని బుధవారం మండల కేంద్రంలోని ఓ బ్యాంకులో డబ్బులను డిపాజిట్ చేసేందుకు వెళ్లగా నకిలీ నోట్లను అధికారులు గుర్తించారు. ఇంకా ఎక్కడెక్కడ దొంగ నోట్ల చలామణి అయ్యాయో అని మండల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రజలు, రైతులు, వ్యాపారులు డబ్బులు తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

విరాళం



గీసుకొండ : తెలంగాణ జాతిపిత, దివంగత ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ఏర్పాటునకు బుధవారం గీసుకొండ గ్రామానికి చెందిన తాటికొండ మల్లేశం రూ.10వేల విరాళంగా అందజేశారు. జయశంకర్ విగ్రహాన్ని నర్సంపేట పట్టణంలోని వల్లభ్‌నగర్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ఆర్చిగేట్ వద్ద విశ్వకర్మ ట్రస్టు వారు ఏర్పాటు చేస్తున్నారు. గీసుకొండలో జరిగిన కార్యక్రమంలో నర్సంపేట ట్రస్టు చైర్మన్ కురిమిళ్ల సుదర్శనాచారి, సభ్యులు మొగులోజు కోటిలింగాచారి, సత్యనారాయణ, కుదురుపాక జగదీశ్వర్, జయశంకర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు శంకరభక్తుల సత్యం, అధికార ప్రతినిధి రాంమూర్తి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఖానాపురం : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా ఇన్‌స్ట్రక్టర్ షేక్ నసీఫా, పంచాయతీ కార్యదర్శి రజిత అన్నారు. మండలంలోని బుధరావుపేటలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకలను పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్ శ్రీలత, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

ఖానాపురం : మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ రెడ్యా అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. కాగా బాధిత కుటుంబాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. రెడ్యా మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, భీక్షంరెడ్డి తదితరులు ఉన్నారు.

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన మైదం ఉప్పలమ్మ అనారోగ్యంతో బుధవారం మృతిచెందింది. కాగా వర్ధన్నపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భానుప్రసాద్ నాయకులతో కలిసి ఉప్పలమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రారంభం మరిచారు!

రెండేళ్ల నుంచి వృథాగా పల్లెదవాఖానా భవనం

- పాఠశాల గదిలోనే వైద్యసేవలు
- నిధుల లేమితో సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ప్రారంభానికి నోచుకోని రాజుపేట పల్లెదవాఖానా

నర్సంపేట రూరల్ : గ్రామస్థాయిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రభుత్వం రాజుపేటలో పల్లెదవాఖానాను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా వైద్యులను సైతం కేటాయించారు. కానీ భవనం పూర్తై రెండేళ్లు గడుస్తున్నా..కనీసం బిల్లులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. దీంతో ఆ పనులు పూర్తికాకపోవడంతో వైద్య ఆరోగ్యశాఖకు భవనాన్ని కాంట్రాక్టర్ అప్పగించలేదు. దీంతో పల్లె దవాఖాన ప్రారంభానికే నోచుకోకుండా వృథాగా ఉంది. అద్దె భవనంలో కొనసాగుతున్న పల్లె దవాఖానకు అద్దె చెల్లించకపోవడంతో దానిని రాజుపేట ప్రాథమిక పాఠశాలలోని ఓ శిథిలావస్థ గదిలోకి తాత్కాలికంగా మార్చారు. ప్రస్తుతం అక్కడే వైద్యసేవలు కొనసాగిస్తున్నారు.

శిథిలావస్థ భవనంలోనే వైద్యం..

రాజుపేట పల్లె దవాఖానా పరిధిలో రాజుపేట, గార్లగడ్డ తండా, చింతగడ్డ తండా, ముత్యాలతమ్మ తండా, మంజ్య నాయక్ తండా, జంగాలపల్లి తండాలు ఉన్నాయి. అయితే వ్యాక్సినేషన్ సమయంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు నేరుగా గ్రామాలకు, తండాలకు వెళ్లి టీకాలు చేస్తున్నారు. మిగతా సమయంలో గ్రామాలు, తండావాసులు రాజుపేటకు వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకుంటున్నారు. అయితే దవాఖానాకు అద్దె చెల్లించాలని వైద్య సిబ్బంది ఉన్నతాధికారులకు తెలియజేసినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో డాక్టర్లే అద్దె చెల్లించారు. ఇంటి యాజమాని తాళం వేయడంతో పల్లె దవాఖానాను రాజుపేట ప్రాథమిక పాఠశాలలోని ఒక గదిలోకి మార్చి తాత్కాలికంగా సేవలు అందిస్తున్నారు. ఆ భవనం కూడా శిథిలావస్థలో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. కొత్త భవనం నిర్మించినప్పటికి ఆ భవనాన్ని ప్రారంభించలేక ఇలా అటు.. ఇటు తిప్పుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే పల్లె దవాఖానాను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

ఇరుకు గదిలోనే వైద్యసేవలు..

నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు మెరుగైనా వైద్య సేవలు అందించాలని పల్లె దవాఖానాకు పక్కా భవనం నిర్మించారు. ఇందుకు గత ప్రభుత్వం సుమారు రూ.16లక్షల నిధులు కేటాయించింది. కాంట్రాక్ట్ పనులను త్వరితగతిన పూర్తిగా చేశారు. పనులను పూర్తి చేసి ఏడాదిన్నర గడుస్తున్న పల్లె దవాఖానాను ప్రారంభించాలనే ఆలోచనే లేకుండా పోయిందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ప్రారంభించడం లేదు. దీంతో వైద్య సిబ్బంది ఇరుకు గదిలోనే వైద్యసేవలు అందిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు.

మాకు అప్పగించలేదు..

రాజుపేట గ్రామ పంచాయతీ ఆవరణలో పల్లె దవాఖానా నిర్మించారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. పనులను పెండింగ్‌లో పెట్టి రెండేళ్ల నుంచి భవనాన్ని ఖాళీగానే ఉంచుతున్నారు. ఉన్నతాధికారులకు పలుమార్లు నివేదించాం. పల్లె దవాఖానను ప్రారంభిస్తే ప్రజలు, వైద్యసిబ్బందికి ఎంతో మేలు జరుగుతుంది.

– డాక్టర్ అరుణ్‌చంద్ర, భాంజీపేట వైద్యాధికారి

రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : రైతులు ప్రస్తుత వ్యవసాయ విధానాలకు స్వస్తి పలికి సేంద్రియ వ్యవసాయం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. బుధవారం అనంతారం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న వ్యవసాయం విధానం వైపు మళ్లీ ఎరువులు, పురుగుల మందులు అవసరం లేని సాగు చేయాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో 125 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేసి రైతులను చైతన్యవంతులను చేస్తామన్నారు. పంట మార్పిడితో పాటు భూసారం ఆధారంగా పంటల ఎంపిక చేసుకుని సాగు చేయాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ అశ్విని, ఏఓ హరిప్రసాద్‌బాబు, తహసీల్దార్ ఎండీ రియాజుద్దీన్, ఏఈఓ ఎం.కావ్య, పంచాయతీ కార్యదర్శి చిత్తరంజన్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

కొనాయమాకులలో..

కొనాయమాకులలో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. కీటక శాస్త్రవేత్త డాక్టర్ డి.వీరన్న పాల్గొని పలు సూచనలు చేశారు.

పల్లె దవాఖానాలో తనిఖీ



మహేశ్వరం పల్లె దవాఖానాలో రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి అరుణ్‌చంద్ర

సాక్షి ఎఫెక్ట్..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ పల్లె దవాఖానాను బుధవారం భాంజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అరుణ్‌చంద్ర తనిఖీ చేశారు. 'పల్లె దవాఖానాలో రోగుల వెతలు.. సమయపాలన ఉద్యోగుల నిర్లక్ష్యం' అనే శీర్షికలో ఈనెల 24వ తేదీన కథనం ప్రచురితమైంది. దీంతో బుధవారం భాంజీపేట వైద్యాధికారి అరుణ్‌చంద్ర తనిఖీ చేసి, విచారణ చేపట్టారు. అనంతరం విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి మెమోలు జారీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.వానాకాలం ప్రారంభమైందని, ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వస్తున్నాయని, వర్షాలకు గ్రామాల్లో జ్వరాలు, తదితర వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని కోరారు. లేదంటే ఉన్నతాధికారులకు నివేదించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓగా శ్రీనివాస్



గీసుకొండ : మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)గా పాక శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీఓగా పనిచేసిన ఆడెపు ప్రభాకర్ ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో పర్వతగిరి ఎంపీఓను శ్రీనివాస్‌ను బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీఓ కృష్ణవేణిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా..



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, చిత్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ : నర్సంపేట నియోజక వర్గంలోని నెక్కొండ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం ఎమ్మెల్యే దొంతి మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజల చిరకాల స్వప్నం నాగారం–ఇంటికన్నె (నెక్కొండ వట్టివాగుపై) బ్రిడ్జి తోపాటు చెక్ డ్యాం నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. రూ.18.60 కోట్ల నిధులు వెచ్చించిన పనులు సకాలంలో పూర్తి అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. అలాగే చిన్నకొర్పోలు–పెద్ద కొర్పోలు గ్రామాల మధ్య ఉన్న వట్టివాగుపై చెక్ డ్యాం నిర్మాణానికి రూ.3.86 కోట్ల నిధులతో పనులు, నెక్కొండ ఊర చెరువు అభివృద్ధికి రూ.16 లక్షలతో చేపట్టే పనులను ప్రారంభించామన్నారు. ప్రజల అవసరాలను దృష్టి ఉంచుకొని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే దొంతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడ్యా తిరుమల్ చౌహాన్, నర్సంపేట కోర్టు ఏపీజీ బండి శివకుమార్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గై లక్ష్మణ్, ఓబీసీ మండల అధ్యక్షుడు మాదాటి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగం ప్రశాంత్, నాయకులు షేక్ షబ్బీర్, కుసుమ చెన్నకేశవులు, శ్రీనివాస్, జమ్ముల సోమయ్య, భీమన్న, రవి, యాదగిరి, శ్రీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రణయ్‌దీప్‌మాదిగ



నగదు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

దుగ్గొండి : గ్రామం నుంచి జాతీయ స్థాయికి దండోరా ఉద్యమాన్ని నడిపి విజయ సాధించిన ఘనత మంద కృష్ణమాదిగకే దక్కుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ మాదిగ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కొలగాని రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో దండోరా ఉద్యమాన్ని నడిపిన జననేతగా కృష్ణమాదిగ గుర్తింపు పొందారన్నారు. ఎస్సీ ఏ,బీ,సీ వర్గీకరణతో పాటు సంక్షేమ పథకాలు సాధించి పెట్టారన్నారు. 30 సంవత్సరాల పోరాటానికి గుర్తుగా ప్రభుత్వం పద్మశ్రీ అందించిందన్నారు. ఈనెల 31న వరంగల్‌కు వస్తున్న సందర్భంగా హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో జరుగు జాతీయ సదస్సుకు మాదిగ బిడ్డలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొట్ల నరేష్, పర్లపల్లి యుగందర్, దామెర సుధాకర్, అరికెల రాజు, కొత్తూరు ప్రశాంత్, జన్ను రవి, జల్లు చిరంజీవి, శ్రీవర్ధన్, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలే ధ్యేయం

రాయపర్తి : ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేయడమే ధ్యేయమని ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతాకుల రంగారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పంపించిన రూ.40వేల నగదును ఎమ్మార్పీఎస్ నాయకులకు అందించినట్లు తెలిపారు. మంద కృష్ణమాదిగ పద్మశ్రీ అవార్డు అందుకొని వరంగల్‌కు వస్తున్న సందర్భంగా స్వాగతం పలికే సంబరాలకు ఎమ్మార్పీఎస్ నాయకులకు అందించినట్లు తెలిపారు. అనంతరం కొండూరు గ్రామంలో రామారపు రాములు ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పూస మధు, గారె నర్సయ్య, రాంచందర్, సుధాకర్ పాల్గొన్నారు.

మారెమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని ద్వారకపేటలో మారెమ్మ తల్లి ఆలయ నిర్మాణంలో భాగంగా బుధవారం మోతె శివునిట్ల గోత్ర వంశస్తులు మోతె తిరుపతిరెడ్డి, సంపత్‌రెడ్డి, సత్తిరెడ్డిల ఆధ్వర్యంలో రాతితో చేసిన దర్వాజను ప్రతిష్ఠాపన చేశారు. వందేళ్ల క్రితం మోతె వంశస్తులచే నిర్మించిన గుడిలో మారెమ్మ తల్లి విగ్రహానికి నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మోతె సౌందర్యనరసింహారెడ్డి, మోతె నవలోకసంపత్‌రెడ్డి, సత్తిరెడ్డి, మోతె అరుణదేవితిరుపతిరెడ్డి, మోతె హైమాఇంద్రసేనారెడ్డి, మోతె సవితభూపాల్ రెడ్డి, మోతె నీరజానరేందర్‌రెడ్డి, మోతె మౌనిక రాజాశేఖర్‌రెడ్డి, మోతె శిరీషవేణుప్రసాద్‌రెడ్డి, డాక్టర్ మోతె నవతకిరణ్‌రెడ్డి, పూజారి ఆరుట్ల శ్రీధర్ ఆచార్యులు, బందేల రామస్వామి, గ్రామస్తులు గంధం నరేందర్‌గుప్తా, చెరుకుపల్లి గోపాల్‌రెడ్డి, మొట్ల రాజిరెడ్డి, గోగుల ప్రతాప్‌రెడ్డి, పున్నం నారాయణరెడ్డి, హైమావతి, సబిత, అరుణ, జమున, శిరీష, మౌనిక, మనస్వి, శివాని తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సఖి సేవల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిబ్బంది

పర్వతగిరి : సఖి సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి, కేస్ వర్కర్ తిరుమల సూచించారు. పర్వతగిరి మదర్ థెరిసా మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం వరంగల్ సఖి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో సఖి సెంటర్ పని చేస్తోందన్నారు. మహిళలు, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని తెలిపారు. బాధిత మహిళలకు కౌన్సిలింగ్ పోలీస్, న్యాయ, వైద్యసాయం, తాత్కాలిక వసతి సేవలను ఉచితంగా 24గంటలు అందుబాటులో ఉంటూ అందిస్తామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ 181కు కాల్ చేస్తే రెస్క్యూ చేయడం జరుగుతుందన్నారు. వృద్ధులకు సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14567, పిల్లలకు సమస్యలు ఎదురైతే 1098కి ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం భవాని, ఏపీఎం కృష్ణమూర్తి, మండల సమాఖ్య కార్యాలయ సిబ్బంది, వీఓఏ, కోఆర్డినేటర్ పావని, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం కిరణ్‌కుమార్



పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

రాయపర్తి : మహిళలు ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఐకేపీ ఏపీఎం కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్వర్ణ భారతి మండల సమాఖ్య కార్యాలయంలో 15వ వార్షిక మహాసభ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ స్నేహ సంఘాలు, ఇన్సూరెన్స్ పథకాలు, బ్యాంక్ లింకేజీలు, వ్యవసాయం, వ్యవసాయేతర కార్యక్రమాలపై చర్చించినట్లు చెప్పారు. మహిళలు సంఘాల ఆధ్వర్యంలో బ్యాంక్‌ల ద్వారా రుణాలను పొందాలని కోరారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి మార్గాలకు పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు దేవేంద్ర, అనిత, పావని, వినోద, యాదగిరి, మండల సమాఖ్య అధ్యక్షురాలు అమరావతి, పాలకవర్గం అబేద, మమత, శైలజ, శారద, మమత, వీఓఏలు, వీఓ అధ్యక్షులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయించొద్దు



సంగెం: షాపులో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్, పోలీసు అధికారులు



గీసుకొండ : ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

సంగెం : రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయించొద్దని, కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని అధికారులు పేర్కొన్నారు. మండలంలోని పలు ఎరువులు, పురుగుల మందుల షాపులను జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం, వ్యవసాయ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో బుధవారం తనిఖీ చేశారు. విత్తనాల నాణ్యత, స్టాక్ రిజిస్టర్, బిల్ పుస్తకాల నిర్వహణను పరిశీలించారు. లోహితలోని శ్రీసాయి ఎరువులు, పురుగుల మందుల షాపులో స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్కులు, ఇన్‌వాయిస్, ఇతర రికార్డులు సరిగా నిర్వహించ లేదని గ్రహించారు. ఆజాజ్ షాపు పరిస్థితి అలాగే ఉండటంతో రెండు షాపుల్లోని పత్తి, మొక్కజొన్న ప్యాకెట్ల విక్రయాలను నిలిపివేశారు. ఏఓ సీహెచ్ యాకయ్య, తనిఖీ అధికారులు గోవర్ధన్ రెడ్డి, ప్రశాంత్, లలిత, ఎస్సై అర్చన, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల షాపులో తనిఖీలు

గీసుకొండ : మండలంలోని కొమ్మాల, మచ్చాపూర్, గీసుకొండ గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల షాపులను వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఏఓలు సీహెచ్ యాకయ్య, గోవర్ధన్, మాధవి, ప్రశాంత్, గీసుకొండ ఏఓ హరిప్రసాద్ బాబు, ఎస్సై కుమార్ పాల్గొన్నారు.

ప్రేమించమని బెదిరిస్తున్న యువకుడిపై కేసు

సంగెం : మండల కేంద్రానికి చెందిన ఓ వైద్య విద్యార్థినిని ప్రేమించానని, తనను ప్రేమించకుంటే చంపుతానని బెదిరిస్తున్న వ్యక్తిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన సదరు విద్యార్థి కొంతకాలం అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. కాగా అదే గ్రామానికి చెందిన యువకుడు బందెల సాయిరాం ఆమెతో చనువుగా ఉంటూ తనను ప్రేమిస్తున్నానని ఫోన్ నుంచి మెసేజ్‌లు చేస్తుండటంతో నచ్చక అతడితో మాట్లాడటం మానేసింది. దీంతో ఆ యువకుడు మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఈనెల 20వ తేదీన తన తండ్రి ఆరోగ్యం బాగా లేకపోవడంతో కరీంనగర్‌లో చదువుకుంటున్న ఆమె సంగెంలోని సొంతింటికి వచ్చింది. దీన్ని గమనించిన యువకుడు ఈ నెల 26వ తేదీన రాత్రి ఆమె ఇంటికి వెళ్లి అసభ్యకరంగా సైగలు చేస్తూ దుర్భాషలాడటమే కాకుండా తనను ప్రేమించకుంటే చంపుతానని బెదిరించాడు. ఈ విషయమై బుధవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మైనర్‌ను వేధించిన బాలుడిపై..

నర్సంపేట రూరల్ : మైనర్‌ను వేధించిన బాలుడిపై కేసు నమోదు చేసినట్లు నర్సంపేట ఎస్సై అరుణ్ కుమార్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలు.. నర్సంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన బాలుడు ఇన్‌స్టా గ్రామ్‌లో వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

- హోంగార్డుకు గాయాలు

నర్సంపేట రూరల్: నర్సంపేటలోని సర్వాపురం శివారు నర్సంపేట–మహబూబాబాద్ 365 జాతీయ రహదారిపై గుర్తుతె తెలియని వాహనం ఢీకొని హోంగార్డుకు గాయాలయ్యాయి. బుధవారం ఖానాపురం పోలీస్ స్టేషన్‌లో కోర్టు విధులు నిర్వహించే హోంగార్డు ఎర్రయ్య నర్సంపేట పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. బుధవారం నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో జాయిన్ అయ్యి సాయంత్రం కోర్టుకు సంబంధించిన సామాన్లు పట్టుకుని ఖానాపురం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. సర్వాపురం గ్రామ శివారు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కిందపడి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించిన 108లో నర్సంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడు కుమారస్వామి

దుగ్గొండి : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని తొగర్రాయి సమీపంలో బుధవారం జరిగింది. తొగర్రాయి గ్రామానికి చెందిన పల్లాటి కుమారస్వామి, యార బుచ్చయ్య దుగ్గొండి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నారు. ఈక్రమంలో దుగ్గొండి–గిర్నిబావి ప్రధాన రహదారిపై ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో కుమారస్వామికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. యార బుచ్చయ్యకు స్వల్ప గాయాలయ్యాయి.

సంఘ సేవకు యువత ముందుకు రావాలి



నర్సంపేట రూరల్ : సంఘాల అభివృద్ధికి, సేవ చేసేందుకు యువత ముందుకు రావాలని దుగ్గొండి పురుషుల పొదుపు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నీల రవీందర్, ప్రస్తుత అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పేర్కొన్నారు. నర్సంపేట మండలంలోని కమ్మపల్లిలో నేతాజీ పురుషుల పొదుపు సంఘం 25వ వార్షికోత్సవం సంఘం అధ్యక్షుడు పెండ్యాల మల్లేషం అధ్యక్షతన సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. అనంతరం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షలను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్న లింగారెడ్డి, ఉపాధ్యక్షుడు మేర్గు రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కందుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు వలుగుబెల్లి రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు గంగిడిరాజిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.